# నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, గురువారం 3 ఏప్రిల్ 2025 VIKARABAD


## కర్రలే విద్యుత్ స్తంభాలు!



మండలంలోని చిట్లపల్లి గ్రామం నుంచి అన్నారం గ్రామానికి వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు లేకపోవడం వల్ల ఓ రైతు తన పొలానికి కర్రలే స్తంభాలుగా ఏర్పాటు చేసుకొని విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. దాదాపు 10కిపైనే పెద్దపాటి కర్రలను ఏర్పాటు చేసుకొని పొలంలో పంటసాగుతో పాటు కూరగాయలు పండించుకొంటున్నాడు. దీన్ని బట్టి చూస్తే రైతులు వ్యవసాయం చేసుకోవడానికి ఎంత ఇబ్బంది అవుతున్నదో అర్థం అవుతున్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - కొడంగల్, ఏప్రిల్ 2

# కాంగ్రెస్ పాలనలో తాగునీరూ కరువే..

- బీఆర్ఎస్ హయాంలో భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణం
- మిషన్ కాకతీయ కింద చెరువులు, కాలువల పూడికతీత, మరమ్మతులు
- మిషన్ భగీరథతో ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీటి సరఫరా
- అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల బాగోగులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- జిల్లాలో గత నెలలో 13.58 మీటర్లు కాగా.. ప్రస్తుతం 14.53 మీటర్ల లోతులో భూగర్భ జలాలు
- గతేడాది మార్చితో పోలిస్తే కూడా తగ్గిన నీటి నిల్వలు
- అత్యధికంగా మర్పల్లి మండలం నర్సాపూర్‌లో 36.36 మీటర్లు, దుద్యాల మండలంలో 32.64 మీటర్ల లోతుకు చేరిన నీటి నిల్వలు
- తాగునీటి కష్టాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు



### జిల్లాలో అడుగంటిన భూగర్భ జలాలు మండలాలవారీగా..

| మండలం | గ్రామం | మీటర్ల లోతుకు |
|---|---|---|
| వికారాబాద్ | మైలార్‌దేవ్‌పల్లి | 43 |
| మర్పల్లి | నర్సాపూర్ | 32.56 |
| దుద్యాల | దుద్యాల | 32.64 |
| నవాబుపేట | మాదిరెడ్డిపల్లి | 22.87 |
| దోమ | దిర్సంపల్లి | 19.47 |
| దోమ | దోమ | 27.57 |
| యాలాల | దేవనూర్ | 32.8 |
| ధారూరు | అంతారం | 16.82 |
| కోట్‌పల్లి | కోట్‌పల్లి | 19.47 |
| కులకచర్ల | ముజాహిద్‌పూర్ | 16.22 |
| పరిగి | రంగంపల్లి | 43 |
| తాండూరు | ఉద్దండాపూర్ | 28.45 |
| జిన్‌గుర్తి | జిన్‌గుర్తి | 17.42 |
| కొడంగల్ | రుద్రారం | 20.16 |



### 14.53 మీటర్లకు చేరిన భూగర్భ జలాలు

జిల్లాలో ఫిబ్రవరి చివరి నాటికి 13.58 మీటర్ల లోతుకు అడుగంటిపోగా, మార్చి చివరి నాటికి ఒక మీటరు మేర నీటి నిల్వలు తగ్గి 14.53 మీటర్లకు నీటి నిల్వలు తగ్గడం గమనార్హం. ఎండల తీవ్రత పెరగడంతో జిల్లాలో భూగర్భజలాలు క్రమంగా తగ్గుతున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. గతేడాది మార్చితో పోలిస్తే ఈ ఏడాది మార్చి చివరి నాటికి .53 మీటర్ల మేర నీటి నిల్వలు తగ్గాయి. ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి మరీ దారుణంగా మారేలా కనిపిస్తున్నాయి.

తాగునీటి కష్టాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు తాగునీటి సమస్య లేకుండా ఇంటింటికి నల్లాల ద్వారా తాగునీరందించి తాగునీటి కష్టాలకు చెక్ పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లడంతోపాటు ట్యాంకర్ల వద్ద యుద్ధాలు నెలకొన్న పరిస్థితులను ప్రజలు మళ్లీ గుర్తు చేసుకుంటున్నారు. గత నెల రోజులుగా జిల్లాలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండల తీవ్రత పెరగడంతో ఓ వైపు భూగర్భజలాలు అడుగంటిపోవడంతోపాటు మిషన్ భగీరథ నీటి సరఫరా అంతంతమాత్రంగానే సరఫరా అవుతుండడంతో తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ ప్రజలు రోడ్డెక్కుతున్నారు. ఫిబ్రవరి మొదటి వారం నుంచే జిల్లాలో తాగునీటి సమస్య నెలకొనడం గమనార్హం.

### తాగు నీరు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి

మరోవైపు ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో మిషన్ భగీరథ నీరు ఎప్పుడొస్తయో తెల్వని పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో వారానికి ఒక్క రోజు మాత్రమే నీటిని వదులుతున్నారు. కొన్ని గ్రామాల్లో అది కూడా లేకపోవడంతో వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. మున్సిపాలిటీల్లోనూ మిషన్ భగీరథ నీటి సరఫరా మూడు, నాలుగు రోజులకోసారి సరఫరా అవుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో తాగునీటి కోసం పరిస్థితులు ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలను గాలికి వదిలేసింది. గతేడాది వేసవికాలంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చేసిన మరమ్మతులకు సంబంధించి రూ.4 కోట్ల నిధులు ఇంకా పెండింగ్‌లోనే ఉండడంతో ఈ ఏడాది తాగునీటి మరమ్మతుల పనులు ఏ విధంగా చేయించాలనే దానిపై సంబంధిత అధికారులకు తలనొప్పిగా మారింది.

జిల్లాలో గతేడాది మార్చి చివరి నాటికి జిల్లాలో 14.06 మీటర్ల లోతులో భూగర్భజలాలుండగా, ఈ ఏడాది మార్చి చివరి నాటికి 14.53 మీటర్ల లోతుకు పడిపోయాయి. ఏప్రిల్ చివరితోపాటు మే వరకు భూగర్భజలాలు తీవ్రస్థాయిలో తగ్గే ప్రమాదముందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని మెజార్టీ చెరువుల్లో నీటి నిల్వలు 90 శాతం మేర తగ్గిపోయాయి. చెరువులతోపాటు ప్రాజెక్టుల్లోనూ నీటి నిల్వలు క్రమంగా తగ్గుముఖం పడుతుండడం చూస్తే ఈనెలాఖరు నాటికి జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులైన కోట్‌పల్లి, లక్నాపూర్, జుంటుపల్లి, శివసాగర్, కాకరవేణి, అల్లాపూర్, నందివాగు, సర్పన్‌పల్లి ప్రాజెక్టుల్లోనూ నీటి నిల్వలు పూర్తిగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. భూగర్భజలాలను పెంపొందించేందుకుగాను ప్రతి గ్రామపంచాయతీలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంకుడు గుంతలను నిర్మించింది. మిషన్ భగీరథ కింద చెరువులు, కాలువల పూడికతీత, మరమ్మతులు చేపట్టింది. మిషన్ కాకతీయ కింద ఇంటింటికీ నల్లాల ద్వారా నీటి సరఫరా చేసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల బాగోగులను పూర్తిగా విస్మరించింది.

- వికారాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ)

# విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జి అమానవీయం

### బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



వికారాబాద్, ఏప్రిల్ 2 : ప్రభుత్వ భూములను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయొద్దని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న హెచ్‌సీయూ విద్యార్థులు, ప్రొఫెసర్లను ప్రభుత్వం అడ్డుకోవడం మంచి పద్ధతి కాదని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మండిపడ్డారు. వారిపై లాఠీచార్జి చేయడం అత్యంత హేయమైన చర్య అని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వ భూములను అమ్మవద్దని చిలుక పలుకులు పలికి, ఇప్పుడు 400 ఎకరాల ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయడానికి పూనుకోవటం దుర్మార్గమన్నారు. కేసీఆర్ హయాంలో గ్రీన్ కవరేజ్ పెరిగి, ప్రపంచంలోనే హైదరాబాద్ గ్రీన్ సిటీగా గుర్తింపు పొందిందన్నారు. కేసీఆర్ పాలనలో హరితహారం జరిగితే, రేవంత్ పాలనలో హరిత సంహారం జరుగుతున్నదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గ్రీన్ కవరేజ్, భూగర్భజలాలు తగ్గడం చూస్తూ ఉంటే, భావితరాలకు సహజ సంపదను దూరం చేయడమే అనిపిస్తున్నదని తెలిపారు. పరిపాలన చేత గాక, చేతులెత్తేసిన కాంగ్రెస్ సర్కారు, ఈ విధమైన చర్యలు చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మన హైదరాబాద్ మోస్ట్ లివబుల్ సిటీగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టడమనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని జిల్లా తరపున ఆయన డిమాండ్ చేశారు.



మూసీ పరీవాహక ప్రాంతం వెంట ఊటలు కొట్టిన రైతులు

# ఊట నీరే గతి..!

- మూసీ పరీవాహక ప్రాంతంలో ఎండిన బోరు బావులు
- పంటలు ఎండుతుండడంతో మూసీ వాగులో ఊటలు కొట్టిన రైతులు
- ఊట నీరుతోనే పంటలకు నీరందిస్తున్న అన్నదాతలు
- నాలుగైదు గ్రామాల రైతులకు ఈ నీరే ఆధారం
- బీఆర్ఎస్ హయాంలో మిషన్ కాకతీయ కింద పూడికతీత, మరమ్మతులు
- కళ కళ లాడిన చెరువులు, కుంటలు
- పూడికతీత, మరమ్మతులపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం
- అడుగంటిన భూగర్భ జలాలు
- పెద్దఎత్తున వట్టిపోయిన బోరుబావులు

వికారాబాద్, ఏప్రిల్ 2, (నమస్తే తెలంగాణ): జిల్లాలో గత బీఆర్ఎస్ హయాంలో మిషన్ కాకతీయ కింద చెరువులు, కుంటల్లో పూడికతీతతో పాటు.. కాల్వలకు మరమ్మతులు చేపట్టడంతో వర్షాకాలంలో వచ్చిన నీటితో చెరువులు, కుంటలు కళకళలాడేవి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం చెరువులు, కుంటల్లోకి నీరొచ్చే కాల్వల మరమ్మతులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వర్షం నీరు చెరువులు, కుంటల్లోకి చేరక ఎండిపోతున్నాయి. దీంతో జిల్లాలో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోతున్నాయి. నెల రోజులుగా ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు, బోర్లు, బావుల్లో నీటి నిల్వలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. గత నెలలో 50 శాతం మేర నీటి నిల్వలుండగా.. ప్రస్తుతం 90 శాతం మేర నీటి నిల్వలు తగ్గిపోయినట్లు అధికారుల అంచనాలు వెల్లడిస్తున్నాయి. జిల్లాలోని మూసీ పరీవాహక ప్రాంత రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. నవాబుపేట మండలంలోని గంగ్యాడతో పాటు నాలుగైదు గ్రామాల రైతులు సాగు చేసిన కూరగాయల పంటలు ఎండుతుండడం, బోర్లలో నీటి నిల్వలు పూర్తిగా అడుగంటిపోవడంతో మూసీ వాగులో ఊటలు కొట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు నాలుగైదు గ్రామాలకు చెందిన సుమారు వంద మంది రైతులు మూసీ వాగులో ఊటలు కొట్టి 3 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని 20-30 ఫీట్ల వరకు ఊట గుంతలు తీసి నీరందిస్తూ వేసిన పంటలను బతికించుకుంటున్నారు. మూసీ వాగులో ఐదు కిలో మీటర్ల మేర ఎక్కడా చూసిన ఊట గుంతలే కనిపిస్తుండడం గమనార్హం. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో రాత్రి సమయంలో వెళ్లి ఊటల నుంచి పంటలకు నీరు పెడుతున్నారు. రాత్రంతా వాగుల వద్ద పడిగాపులు కాస్తూ ఎప్పుడు నీరు ఊరుతుందా, ఎప్పుడు పంటలకు నీరు పెడుదామా అని ఎదురుచూస్తూ రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.

### ఆకుకూరలు సాగు చేస్తున్నాం



నాకు 4 ఎకరాల భూమి ఉన్నది. మూడున్నర ఎకరాల్లో కంది, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేస్తాను. మూసీ నది దగ్గరలో అర ఎకర భూమి ఉన్నది. దీంతో పాలకూర, పుంటి కూర సాగు చేస్తున్నా. ఆకుకూరలను హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి మార్కెట్‌లో అమ్ముకొని వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషించుకునేవాడిని. వీటికి నిత్యం నీరు కావాల్సి ఉంటుంది. ఎండాకాలం రావడంతో మూసీ పూర్తిగా ఎండిపోయింది. చెరువులో ఇటాచి సహాయంతో రూ.5,500 ఖర్చు చేసి దాదాపు 2 గజాల లోతు తవ్వించి చెలిమెలా చేసి నీటిని తీశాము. అందులో మోటర్ వేసి పంటకు పారబెడుతున్నాం. ఆ నీరు కూడా కొద్దిసేపే వస్తున్నది. మళ్లీ నీరు వచ్చేంత వరకు ఆగాల్సి వస్తున్నది. నీళ్లు లేక ఆకుకూరల పెంపకానికి ఇబ్బందులు పడుతున్నాం. **- కుర్వ రాములు, గంగ్యాడ, నవాబుపేట మండలం**

### ఊట నీరే దిక్కు



ఊట నీటితోనే 2 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. ఎండాకాలం రావడంతో మూసీ ఎండిపోయి పంటలకు నీరు అందడంలేదు. నదిలో ఇసుక అధికంగా ఉంటంతో నీళ్లు అడుగంటిపోయాయి. జేసీబీ సహాయంతో రూ.6వేలు ఖర్చు చేసి దాదాపు 15 ఫీట్ల వరకు గుంత తవ్వాల్సి వచ్చింది. నీరు రావడంతో 3హెచ్‌పీ మోటర్ సహాయంతో వరి పంటను సాగు చేస్తున్నా. అంతకు ముందు కూరగాయలు సాగు చేశాను. నదిలో నీరుంటే పంటలు బాగా పండేవి. మూసీ నదిపై దాదాపు 60, 70 మంది ఆధారపడి సాగు చేస్తున్నారు. మూసీలో ఇసుకను తొలగిస్తే నీళ్లు వచ్చే అవకాశాలు ఉంటాయి. చుట్టుపక్కల రైతులకు ఎంతో మేలు కలుగుతుంది.

**- పసికె వెంకట్‌రాంరెడ్డి, గంగ్యాడ, నవాబుపేట మండలం**

# నేడు మాజీ మంత్రి హరీశ్‌రావు రాక

### ఏర్పాట్లను పర్యవేక్షించిన మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



బోయిన్‌గుట్ట తండాలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్, ఏప్రిల్ 2 : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు గురువారం కడ్తాల్ మండలంలో పర్యటించనున్నారని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. పర్యటనలో భాగంగా మండల పరిధిలోని మర్రిపల్లిలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తారని తెలిపారు. ముద్విన్ గ్రామంలో రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో పేద కుటుంబానికి నిర్మించిన ఇంటిని, చరికొండ గ్రామ పంచాయతీలోని బోయిన్‌గుట్ట తండాలో కొత్తగా ఏర్పాటు చేసిన సంత్ సేవాలాల్ మహరాజ్, మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరిస్తారని జైపాల్‌యాదవ్ తెలిపారు. ఈమేరకు బుధవారం మధ్యాహ్నం హరీశ్‌రావు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్, స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ప్రారంభోత్సవాల అనంతరం బోయిన్‌గుట్టలో తండాలో నిర్వహించనున్న సభలో హరీశ్‌రావు పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలు, రెండు మున్సిపాలిటీల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి వచ్చి హరీశ్‌రావు పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వీరయ్య, మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, కడ్తాల్ గ్రామాధ్యక్షుడు రామకృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ శివ, నాయకులు అంజి నాయక్, భీక్యానాయక్, మహేశ్ ఉన్నారు.



# ఆదరణ లేక మరోసారి..

సిటీబ్యూరో, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : ల్యాండ్ రెగ్యులరైజేషన్ పథకంపై ప్రభుత్వం గంపెడాశలు పెట్టుకుంటే... తట్టెడు మంది కూడా స్పందించలేదు. దీంతో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ద్వారా వేల కోట్ల ఆదాయం అడియాశలయ్యాయి. మార్చి 31 వరకు ఫీజులు చెల్లించినవారికి 25 శాతం రాయితీ ఇచ్చినా.. దరఖాస్తుదారులు ముందుకు రాలేదు. దీంతో ఏప్రిల్ 30 వరకు 25 శాతం రాయితీ సదుపాయాన్ని పొడిగించింది. హెచ్ఎండీఏ పరిధిలో 3.45 లక్షల మంది, జీహెచ్ఎంసీ పరిధిలో 1.5 లక్షల మంది తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. కానీ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో నెలకొని ఉన్న స్తబ్ధత కారణంగా ఎల్ఆర్ఎస్ ప్రక్రియకు ఆశించిన స్థాయిలో ఆదరణ రాలేదు. ఈ క్రమంలో ప్రభుత్వం ఏప్రిల్ నెలాఖరు వరకు గడువు పెంచారు.

## నాడు.. నేడు







# నాడు కళ కళ .. నేడు వెలవెల..

యాచారం మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన సాలి చెరువు బీఆర్ఎస్ హయాంలో నీటితో కళకళలాడుతూ మత్తడి పోసింది. దీంతో ఆయకట్టు భూములకు మెండుగా సాగునీరందింది. కానీ కాంగ్రెస్ పాలనలో ఏడాది కాలంగా నెర్రెలు బారి కంప చెట్లకు నిలయంగా మారి నీళ్లు లేక వెలవెలబోతున్నది. ఆయకట్టు పొలాలకు సరిపడా సాగు నీరు లేక క్రమంగా పంటలు ఎండిపోతున్నాయి. - యాచారం, ఏప్రిల్ 2